పిల్లల కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్ 7లో..
నిందితులను కఠినంగా శిక్షించాలి 8లో..

శ్రమయోగికి ప్రచారం కరువు

- కొనసాగుతున్న పీఎంఎస్‌వైఎం నమోదు ప్రక్రియ
- కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..ఆఫ్‌లైన్‌లో లేని అవకాశం
- అందుబాటులో లేని నమోదైన వారి వివరాలు
- క్షేత్ర స్థాయిలో అవగాహనకు ప్రాధాన్యం ఇస్తేనే ప్రయోజనం



జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రమ జీవుల ఆశా పథకమైన ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ (పీఎంఎస్‌వైఎం)కు ప్రచారం కరు వైంది. దీంతో అర్హులైన కార్మికులు పథకం కింద లబ్ధి పొందలేకపోతున్నారు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కొందరు, భవన నిర్మాణ కార్మికులుగా ఇంకొందరు, పరిశ్రమల్లో మరి కొందరు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో కాం ట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా చాలీచా లని వేతనాలతో పని చేస్తున్నారు. వారి రెక్కా డితేగానీ డొక్క నిండేది.. ఆరోగ్యపరంగా సమ స్యలు తలెత్తి ఇంటివద్దే ఉండిపోతే పస్తులు తప్పని పరిస్థితులుంటాయి. అనుకోని పరి స్థితి లో కుటుంబ పెద్ద అర్ధాంతరంగా తనువు చాలి స్తే కుటుంబం రోడ్డున పడాల్సిందే. ఇలాంటి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ పథకం ఆశలను కలిగిస్తోంది. ఈ పథకంలో అర్హులందరూ ప్రచార లోపం వల్ల చేరడం లేదు.

పింఛనుతో భరోసా....

జిల్లాలో జనాభా అంచనా ప్రకారం 10,89,779 మంది ఉన్నారు. ఇందు లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కలిపి సుమారు 20 వేల మంది వరకు ఉంటారు. మిగితా వారిలో ఎక్కువ మంది అసంఘ టిత రంగ కార్మికులే ఉన్నారు. జిల్లాలో సుమారు 5 లక్షల మంది వరకు వీరు ఉంటారన్న అంచనా ఉంది. అలాంటి వారు కేంద్రం తీసుకొచ్చిన పీఎం శ్రమయోగి మాన్‌ధన్ పథకం ద్వారా లబ్ధిపొందేం దుకు అవకాశం ఉంటుంది. శ్రమయోగి పథకం కింద ప్రతినెలా వాటాధనం చెల్లించాలి. చెల్లించలేని పరిస్థితిలో ఉన్నప్పుడు మధ్యలోనే ఆపివేసే అవకాశం ఉంది. వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తారు. ఒకవేళ లబ్ధిదారు మృతి చెందితే భార్య కొనసాగించే వెసులుబాటు ఉంటుంది. లేదంటే చెల్లించిన మొత్తాన్ని వడ్డీ తో కలిపి తీసుకునేందుకు వీలుంటుంది. లబ్ధిదారు వయస్సు 60 సంవత్స రాలు దాటగానే కనిష్ఠంగా ప్రతినెలా రూ. 3 వేల చొప్పున పింఛను అందుతుంది.

అందుబాటులో లేని వివరాలు...

ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ పథకం కింద జిల్లాలో ఇప్ప టివరకు నమోదు చేసుకున్న కార్మికుల వివరాలు సంబంధిత శాఖ అధికా రుల వద్ద అందుబాటులో లేవు. జిల్లాలో ఏఏ కార్మికులు నమోదు చేసుకు న్నారు...నమోదు చేసుకోకుండా మిగిలిన వారు ఎవరు...అన్న వివరాలు లే కపోవడంతో సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నమో దు చేసుకోని వారిని ప్రోత్సహించి లబ్ధి కల్పించాల్సిన అవసరం ఉండగా దీనిపై దృష్టి సారించకపోవడంతో అర్హులకు పథకం అందడం లేదన్న విమర్శలున్నాయి. పీఎంఎస్‌వైఎం కింద జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 1.10 లక్షల మంది నమోదు చేసుకున్నారన్న అంచనా సంబంధిత వర్గాల్లో ఉంది.

అర్హతలు ఇవీ..

అసంఘటితరంగ కార్మికులై, 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వయసు వారై ఉండాలి. నెల సరి ఆదాయం రూ. 15 వేలకు మించకూడదు. ఈపీఎఫ్ సదుపాయం ఉన్నవారు అనర్హులు. ఆదాయ పన్ను చెల్లింపు కార్మికులకు అర్హత ఉండదు. సమీపంలోని కామన్ సర్వీస్ కేంద్రాల్లో, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసు కోవచ్చు. తుది గడువు అంటూ లేదు. దరఖాస్తును కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరగడం లేదు. ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో పాటు సెల్ఫ్ అటెస్టెడ్ పత్రాన్ని జత చేయాల్సి ఉంటుంది. మొదటి నెల మీసేవ కేంద్రంలో సంబంధిత రుసుము చెల్లించాక శ్రమయోగి మాన్‌ధన్ పింఛను నంబరు జనరేట్ అవుతుంది. రెండో నెల నుంచి బ్యాంకు ఖాతా నుంచే నేరుగా జమ అవుతుంది. సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 18002876888 ఫోన్ చేసి నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. ఈ నంబరు 24 గంటలు పనిచేస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి

సురేంద్ర కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి

ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పింఛను పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. అసంఘటితరంగ కార్మికులకు ఈ పథకం భరోసా కల్పించనుంది. క్షేత్రస్థాయిలోనూ అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవడంతో ప్రతినెలా వాటాధనం చెల్లించాలి. అయితే ఈ పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు నమోదు చేసుకున్న వారి వివరాలు అందుబాటులో లేవు. మా లాగిన్‌లో వివరాలు పరిశీలించే అవకాశాలు లేవు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాకేష్



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 17: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్యారంగానికి కనీసం ఆ శాఖ మంత్రిని కేటాయించలేదన్నారు. విద్యారంగాన్ని విస్మరిస్తూ, రూ.8500కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు రాని కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మనోహర్, ప్రశాంత్, శివ, పవన్, రవి, విఘ్నేష్, జశ్వంత్, లావణ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కోరుట్ల, ఆగస్టు 17 : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా నాయకులు సుతారి రాములు అధ్యక్షతన జరుగగా చాడ వెంకటరెడ్డి పాల్గొన్ని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. 100 సంవత్సరాల చరిత్ర సీపీఐ పార్టీకి ఉందని ప్రజా పక్షాన నిరంతరం పోరాటం చేస్తూందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలను అందించాలన్నారు. సీపీఐ నాయకులు కలవేని శంకర్, చెన్న విశ్వనాథం, ఎండి మౌలానా, కొక్కుల శాంతి, ఎన్నం రాధ, ఉస్మాన్, అక్రం, రామిల్ల రాంబాబు, గోదూర్ మురళి పాల్గొన్నారు.

రోగులకు సత్వర సేవలందించాలి

రాయికల్, ఆగస్టు 17: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సత్వర సేవలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి అన్నారు. రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు రికార్డులను, మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డిప్యూటీ, ప్రోగ్రాం ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

తండ్రి అంత్యక్రియలకు దుబాయ్ నుంచి వచ్చిన కొడుకు మృతి



గండిగ రమేష్

కథలాపూర్, ఆగస్టు 17 : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్‌లో తండ్రి మరణించిన వార్త తెలిసి స్వగ్రామానికి అంత్యక్రియల కోసం దుబాయి నుంచి వచ్చిన కొడుకు గుండెపోటుతో శనివారం మృత్యువాత పడ్డాడు. గ్రామస్థుల కథనం ప్రకారం..గండిగ గంగరాజం (70) అనే వృద్ధుడు అనారోగ్యంతో ఈనెల 11వ తేదీన మృతి చెందాడు. గంగరాజంకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. చిన్న కొడుకు గండిగ రమేశ్ (40) దుబాయిలో పనిచేస్తున్నాడు. తండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సమాచారాన్ని దుబాయిలో ఉన్న రమేశ్‌కు కుటుంబ సభ్యులు చేరవేశారు. అక్కడ సకాలంలో విమానాలు అందుబాటులో లేకపోవడంతో 13వ తేదీ మంగళవారం స్వగ్రామానికి చేరుకున్నాడు. అప్పటి వరకు తండ్రి మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచారు. రమేశ్ వచ్చిన రోజే గంగరాజం అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియల నిమిత్తం వచ్చిన నాలుగు రోజులకే శనివారం రాత్రి రమేశ్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. వారం రోజుల్లోపే తండ్రీ కొడుకులు మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రమేశ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దు

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 17: ధర్మపురి పట్టణంలోని లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల విద్యార్థులకు సంబంధించిన మౌలిక వసతులు కల్పించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కళాశాల పున: ప్రారంభం సందర్భంగా అధికారులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల భవనానికి సంబంధించిన మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నదీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్నానఘట్టాల వద్ద చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులు స్నానాలు అనంతరం దుస్తులు మార్పిడి కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయించాలని సూచించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ తిమ్మాపూర్ గ్రామంలోని గండి హనుమాండ్ల దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వామి ప్రసాదాలు అందించారు. మాట్లాడుతూ ధర్మపురి పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగు నీరిందించేందుకు ఈ పథకం ద్వారా రూ 22 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈఈ గోపాల్, ఏఈఈ ముకరం, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, కాశెట్టి రాజేష్, రాపర్తి సాయి కుమార్, ఎండీ షబ్బీర్, బొల్లారపు పోచయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాలలో సందర్శిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బీర్‌పూర్ మండలంలో మరో రెండు జీపీలు



కొమురంభీమ్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకుంటున్న గోండుగూడెం ఆది వాసులు

బీర్‌పూర్, ఆగస్టు 17: బీర్‌పూర్ మండలంలో మరో రెండు నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారిచేసింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నూతన గ్రామపంచాయతీల ప్రజలకు శుభాకాం క్షలు తెలిపారు. బీర్‌పూర్ మండల ఏర్పాటు సమయంలో 11 గ్రామాలతో ఉన్న మండలంలో చిత్రవేణి గూడెం, కందెనకుంట, చిన్నకొల్వాయి, కోమన్‌పెల్లిలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి 15 గ్రామాలు గల మండలంగా చేశారు. మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలోని అమ్లెట్ గ్రామమైన ఇందిరానగర్ వాసులు, మంగేళ గ్రామంలోని అమ్లెట్ గ్రామమైన గోండుగూడెం వాసులు గ్రామపంచాయతీ కోసం ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. వీరి వినతులను పరిశీలించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారి చేసింది. దీంతో బీర్‌పూర్ మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 17కు చేరనుంది. ప్రభుత్వం నుంచి వచ్చిన గెజిట్‌ను బట్టి ఎమ్మెల్యే టెలికాన్ఫరెన్స్ ద్వారా నాయకులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మండలంలోని నర్సింహులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఇందిరానగర్ ప్రజలు ఇందిరా నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. గోండుగూడెం ఆదివాసీ ప్రజలు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు.

దాడులు కాదు.. అభివృద్ధి, సంక్షేమం ప్రధానం

- కేసీఆర్ పాలనను సీఎం ఆదర్శంగా తీసుకోవాలి
- జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్



సమావేశంలో మాట్లాడుతున్న దావ వసంతసురేష్

రాయికల్, ఆగస్టు 17: దాడులు, దాదాగిరి కాదు.. అభివృద్ధి, సంక్షేమం ప్రధానమని, కేసీఆర్ పాలనను సీఎం రేవంత్ రెడ్డి ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పరి షత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు క్యాంప్ ఆఫీస్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తూ రాయికల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల నాయకులతో కలి సి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దావ వసంతసురేష్ మాట్లాడుతూ హరీష్‌రావు క్యాంప్ ఆఫీస్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులు ఈ దాడికి తెగప డటం విచారకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల కోసం అనేకసార్లు పదవులను లెక్క చేయకుండా రాజీనామా చేసిన గొప్ప వ్యక్తి హరీష్ రావు అని కొనియాడారు. కేసీఆర్ పాలనను సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభు త్వం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పదేళ్ల పాలనలో ఎక్కడా ప్రతిపక్షంపై దాడులు జరుగలేదన్నారు. బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, పట్టణ అధ్యక్షుడు అనిల్, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేష్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉదయశ్రీ, మండల మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్‌లు వేణు, మల్లేష్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



ప్రభుత్వ ఆసుపత్రిలోని మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, ఆగస్టు 17 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవం అయ్యే విధంగా వైద్యులు దృష్టి సారించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్యులు సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందించారు. ఆసుపత్రిలోని ఓపీ రికార్డులను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీసారు. ఆసుపత్రిలోని స్టాక్ పొజిషన్, సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం అందుతుందా అని ఆసుపత్రిలో ఉన్న ఇన్‌పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. పట్టణంతో పాటు మండలంలోని ఉన్న గురుకుల, మాడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలలో కుక్క, పాము కాటు మందులు నిలువ ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంద్ కుమార్, జిల్లా వైద్యాధికారి సమియోద్దిన్, తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

వారంలోగా సమస్యలను పరిష్కరించాలి

మెట్‌పల్లి రూరల్ : గ్రామాలలో ఇంటికో జ్వర పీడితలు ఉన్నారని, వారి కోసం స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామాల్లోని సమస్యలను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు. శనివారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆసపత్రిలోని ఓపీ రిజిస్టర్, సేవలు, ఐపీ సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసీ, స్టాక్ వివరాలు, పంచాయతీ కార్యాలయంలో వైద్య సేవలు, ఓపీ రిజిస్టరు, పరిసరాలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల గురించి వైదులను, అధికారులు, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చారించారు. పాము, కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జగ్గసాగర్‌లో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపు పరిశీలంచి అందిస్తున్న సేవల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



జగ్గసాగర్‌లోని సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్





అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, ఆగస్టు 17: మండలంలోని సిద్ధిపల్లి వద్ద ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాలీలో తరలిస్తున్న బియ్యాన్ని మంథని పోలీసు స్టేషన్ అప్పగించి నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ అంజి, మరో వ్యక్తి రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు నుంచి దట్టమైన పొగలు

భయభ్రాంతులకు గురైన వాహనదారులు



కారు నుంచి వస్తున్న పొగలు

జమ్మికుంట, ఆగస్టు 17: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి హుజూరాబాద్ వెళ్తున్న ఓ కారు నుంచి శనివారం ఒక్కసారిగా దట్టమైన పొగలు వెలువడ్డాయి. దీంతో కారులో ఉన్న వారు భయపడి కిందకు దిగి దూరంగా వెళ్లారు. కారు సమీపంలో ఉన్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఇంజన్ నుంచి పొగలు వస్తుండటంతో కారు పేలుతుందనే భయంతో పరుగులు పెట్టారు. కాసేపటికి పొగలు తగ్గడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.









చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు
తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 17 : నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు శనివారం పెనుప్రమాదం తప్పింది. శనివారం జగిత్యాల బస్టాండ్‌లో సుమారు 100 మంది ప్రయాణికులను ఎక్కించుకొని జగిత్యాల నుంచి ఖానాపూర్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో బస్సు ప్రయాణిస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్- మోర పల్లి గ్రామాల శివారులో బస్సు డ్రైవర్ వెనుక వైపు ఉన్న రెండు చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లాయి.. దీంతో బస్సు ఒక్కసారిగా కిందకు పడి ఒకేవైపు కుంగడంతో ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేసి భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ప్రయాణిస్తున్న 100 మందికి ఎలాంటి ప్రమాదం కాలేదు. దీంతో బస్సులో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరో బస్సు ఏర్పాటు చేసి వారిని గమ్యస్థానానికి చేర్చారు.

పిల్లల కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

● 3.50 లక్షలకు ఇద్దరు ఆడ పిల్లల అమ్మకం ● వివరాలు వెల్లడించిన సీఐ

మెట్‌పల్లి, అగస్టు 17(ఇబ్రహీంపట్నం): ప్రియుడి మోజులో పడ్డ ఓ తల్లి తన ఇద్దరు కూతుళ్లను అమ్ముకుంది. కని పెంచిన అమ్మే ప్రియుడితో కలిసి సొంత బిడ్డలను అమ్ముకుంది. చివరికి ప్రియుడితో పాటు ఆమె కూడా కటకటాల పాలైంది. ఇద్దరినీ మెట్‌పల్లి పోలీసులు పక్కా ప్లాన్ వేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా సారంగాపూర్‌కు చెందిన ఇస్లావత్ లావణ్య (జమున)కు ఎనిమిదేళ్ల క్రితం ఫకీర నాయక్‌తో పెళ్లైంది. లావణ్యకు ఇద్దరు అడపిల్లలున్నారు. రెండేళ్ల క్రితం భర్తతో విబేధాలు రావడంతో వదిలేసి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో లావణ్య ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండపూర్‌లోని ఓ దాబాలో పని చేస్తుండగా అమ్మక్క పేటకు చెందిన ఇస్లావత్ నాగేష్‌తో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో లావణ్య ఇద్దరు అడపిల్లలను ప్రియుడితో కలిసి అమ్మాలని అనుకుంది. అనాథ పిల్లలని నమ్మించి మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి ఆరేళ్ల బాలిక వైష్ణవిని 2 లక్షలు, మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్ నగర్‌కు చెందిన ఒకరికి మూడేళ్ల బాలిక కృష్ణవేణిని 1.50 లక్షలకు అమ్మింది. ఇదే క్రమంలో బాబు కావాలని ఒకరు అడుగగా 1.50 లక్షలకు డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం ఈ నెల 13న నాగేష్ మెట్‌పల్లిలోని దుబ్బవాడలో రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి దొరిపోయాడు.


కిడ్నాప్‌నకు పాల్పడిన నాగేష్

నాగేష్‌ను పట్టుకున్న పోలీసులు కిడ్నాప్ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ చేయగా ఇద్దరు అడపిల్లలను అమ్మిన విషయం వెలుగులోకి వచ్చింది. కిడ్నాప్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకునేందుకు సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి ప్రత్యేక టీంగా ఏర్పడి గాలిస్తుండగా పట్టణంలోని చావిడి వద్ద కిరాయి ఉంటున్న ఇంట్లో ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు చిన్నారులను శిశు సంరక్షణా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. నాగేష్‌పై గతంలో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, జిగిత్యాల జిల్లా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో పలు దొంగతనాలలో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

'మిడ్ మానేరు'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు
కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 17: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 4,500 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 590 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.44 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.38 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి...

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 2.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మధ్యమానేరు నుంచి 3600 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు లోకి ఎగువ ప్రాంతం నుంచి 10865 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగు నీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.449 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

కాకతీయ కాలువకు కొనసాగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు కాలువకు 4,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 15,320 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.518 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి అవసరాలకు ప్రాజెక్టు నుంచి 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిన్నాన్నను కేసులో ఇరికించేందుకు యువకుడి కట్టుకథ

● కిడ్నాప్‌నకు గురైనట్లు డ్రామా ● పోలీసుల విచారణలో బయటపడిన వ్యవహారం

చందుర్తి, ఆగస్టు 17: భూ వివాదంలో ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించడానికి యువకుడు అల్లిన కట్టుకథ వీడింది. పోలీసుల విచారణలో కిడ్నాప్ వ్యవహారం డ్రామాగా తేలింది. శనివారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన ఎక్కలదేవి గంగరాజుకు అదే గ్రామానికి చెందిన అతడి చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యకు మధ్య కొంత కాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గొడవలకు సంబంధించి గంగరాజు రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో తన చిన్నాన్నతోపాటు అతడి కుమారులు, మరో ముగ్గురిని క్రిమినల్ కేసుల్లో ఇరికించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలో గురువారం గంగరాజు అదృశ్యమయ్యాడు. అదే రోజు ఉదయం పొలం వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులు షర్టు, మొబైల్ ఫోన్ చిందరవందరగా పడి ఉండడం గ్రామస్థులకు కనిపించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందిచారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే గాలింపు చేపట్టారు. చుట్టుపక్కల వ్యవసాయ బావుల్లో వెతికించారు. ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారు జామున పొలం పనులకు వెళ్తున్న రైతులకు చేతులు, కాళ్లకు తాళ్లు కట్టి ఒంటిపై దుస్తులు లేకుండా, ముఖంపైనా, ఒంటిపైనా బురదతో గంగరాజు కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు సంఘటన స్థలానికి చేరుకుని గంగరాజును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. అతడిని విచరించగా గుర్తుతెలియని వ్యక్తులు తన చేతులు, కాళ్లను కట్టేసి అడవిలో వదిలి వెళ్లినట్లు గంగరాజు పోలీసులతో కథ అల్లాడు. గంగరాజు వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టడంతో కిడ్నాప్ వ్యవహారం బయటపడింది. తన చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్య, అతడి కుమారులు భూమి విషయంలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకు, వారిని కేసుల్లో ఇరికించి భయపెట్టేందుకు కిడ్నాప్ డ్రామా ఆడినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ధర్మపురి, ఆగస్టు 17: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆలయాలకు చేరు కుని స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరదకాలువలో పడ్డ ట్రాక్టర్ వెలికితీత


వరదకాలువలో నుంచి పైకి తీస్తున్న ట్రాక్టర్

మల్యాల, ఆగస్టు 17: రెండు రోజుల క్రితం వరదకాలువలో పడ్డ ట్రాక్టర్‌ను శనివారం వెలికి తీశారు. మండలంలోని రాంపూర్ శివారులో గురువారం ట్రేలర్‌తో పాటు ట్రాక్టర్ వరద కాలువలో పడింది. నీరు అధికంగా ఉండడంతో బయటకు తీసే ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో శనివారం ఇరిగేషన్ అధికారులు పంప్‌హౌజ్ వద్ద గల గేట్లను ఒపెన్ చేయడంతో కాలువలోని నీరు తగ్గుముఖం పట్టాయి. నీరు తగ్గి ట్రాక్టర్ తేలడంతో గ్రామస్థులు రెండు జేసీబీల సహాయంతో తాళ్లు కట్టి కాలువ పైకి తీశారు.

21న జాబ్ మేళా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: నగరంలోని సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ కంపెనీ మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో మేయర్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 30 నుంచి 35 ఏళ్ల వయసు గల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ సీనియర్ మేనేజర్ మాకులూరి రాం మోహన్, మేనేజర్ సిరిసిల్ల ప్రసాద్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 9848168440 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్సు దొంగిలిస్తున్న మహిళ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి నుంచి పర్సు, సెల్‌ఫోన్‌లను ఓ మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు శనివారం పట్టుకున్నారు. బస్టాండ్‌లోని ఇన్‌గేట్ వద్ద హైదరాబాద్‌కు చెందిన శ్రుతి అనే మహిళా ప్రయాణికురాలు బస్సు దిగుతుండగా ఆమె పర్సు, సెల్‌ఫోన్‌ను విజయవాడకు చెందిన మాధవి అనే మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ ఏఎస్‌ఐ ఎం.లక్‌పతి, హెడ్ కానిస్టేబుల్ ఎం.సాగర్, వైసారయ్య, మానసలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన మహిళ వద్ద నుంచి 3 పర్సులు, ఒక బంగారు గాజు, 42 వేల నగదును స్వాధీనం చేసుకుని, ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


వినోద్‌కుమార్ (ఫైల్)

మానకొండూర్, ఆగస్టు 17: మానసిక స్థితి సరిగా లేక ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన నాయిని వినోద్‌కుమార్ (32)కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. శుక్రవారం పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వినోద్‌కుమార్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ ఇన్‌చార్జి మొగిలి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రంగయ్య (ఫైల్)

ఇల్లంతకుంట, ఆగస్టు 17: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మొగిలోజు రంగయ్య (70) అనే రైతు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రంగయ్య శనివారం వ్యవసాయ బావివద్ద పొలంలోని ఒడ్లు చెక్కడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న విద్యుత్‌స్తంభం సపోర్టు వైరుకు తగిలాడు. సపోర్టు వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండటంతో రంగయ్య విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడు రంగయ్య భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 17: సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఒల్లెపు వంశీ (24), ఒల్లెపు భీంరాజ్ (20)అనే గంజాయి విక్రయదారులను శనివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. వీరి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వీరు హైద్రాబాద్‌లో గంజాయి కొనుగోలుచేసి సిరిసిల్లకు వచ్చి విద్యానగర్‌లోని వైకుంఠధామం వద్ద ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం వచ్చిందన్నారు. దీంతో అన్నదమ్ములను పట్టుకొని విచారించగా వారి వద్ద 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వెంటనే ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

ఘనంగా శ్రీ భూ ఆదివరహా స్వామి కల్యాణ మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని ఆదివరహాస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. స్వామి వారి జయంత్యుత్సవాల్లో భాగంగా వేదపండితులు కనుకుంట్ల వరప్రసాద్ శ్రీనివాసాచార్యులు, రామాంజనేయుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. ఉదయం నిత్యాభిషేకం, గోపూజ, తీర్థ ప్రసాద గోష్టి అలాగే నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమం, పూర్ణాహుతి తదితర వాటిని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కాంతారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాదాసు రవీందర్ సుజాత దంపతులు అన్నదానం నిర్వహించారు.

అధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశం

ఆధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశమేనని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శరణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సర్వసతి మహాస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు అధ్యాత్మిక సంపదను అందిస్తున్న ఏకైక దేశం భారతదేశమన్నారు. ఆధ్యాత్మిక సంపదకు మూలాధారాలు దేవాలయాలు, గ్రంథాలు, భగవద్గీత, రామాయణం, భాగవతం, వేదాలు మాత్రమేనన్నారు. అనంతరం ఆయనను ఆలయ అర్చకులు, ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, దేవాదయ ఇన్స్‌పెక్టర్ సుజాత, ఈవో శంకర్ తదితరులు ఉన్నారు.


బాల బ్రహ్మానంద సర్వసతిని సన్మానిస్తున్న అర్చకులు, అధికారులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

●జూనియర్ డాక్టర్ అత్యాచార, హత్య ఘటన బాధాకరం ●జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
●జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 17: కోల్‌కతలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన బాధాకరం అని, దోషులను గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేయాలని ఐఎంఏ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్ వద్ద వైద్యులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సంఘీభావం తెలిపి. నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన ఘటన చాలా బాధాకరమని, ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టి దోషులను పట్టుకొని శిక్షించాలన్నారు. జగిత్యాల ఐఎంఏ, మహిళా వైద్యుల పక్షాన ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డా. తాటిపాముల సురేష్, ప్రధాన కార్యదర్శి డా.అజయ్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

కోరుట్ల : దోషులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోరుట్ల శాఖ డిమాండ్ చేసింది. శనివారం పట్టణంలోని కోరుట్ల నర్సింగ్ హోం నుంచి పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్గిల్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. వైద్యురాలుకు నివాళ్లను అర్పించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అనూప్‌రావు, పట్టణ అధ్యక్షుడు రెగోండ రాజేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు కటకం జగదీశ్వర్, రవికిరణ్, దిలీప్‌రావు, శంకర్, సంపత్, స్వేతి అనూప్, శ్రీలత, అనూరాధ, ప్రియాంక, గీత, శృతి, దీప్తిలు పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యులు, ప్రెస్ క్లబ్ సభ్యులు మద్దతు తెలిపారు.

రాయికల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థి మోహితపై జరిగిన సామూహిక అత్యాచారానికి నిరసనగా రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలతో వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశికాంత్ రెడ్డి, వైద్యులు సతీష్, శ్రీకాంత్, ఉదయ్, రజిత, తేజస్విని, వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లి : మండల కేంద్రంలో హెల్పింగ్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి శనివారం ఘన నివాళులర్పించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చౌటపెల్లి తిరుపతి, జంగిలి ఎల్లయ్య, అంకం భూమయ్య, మద్దెల గోవర్ధన్, అంకం సతీష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఐఎమ్ఎ ఇచ్చిన నిరసన ర్యాలీకి ప్రజా సంఘల నాయకులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, మేధావులు, విద్యార్థులు సంపూర్ణ మద్దతు ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. ఆనంతరం ఆర్డిఓ కార్యలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఐఎమ్ఎ అధ్యక్షులు డాక్టర్ గంగాసాగర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు, ప్రజా సంఘల నాయకులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐఎంఏ హాల్ వద్ద నుంచి ర్యాలీగా బయల్దేరుతున్న డాక్టర్‌లు

ధర్మపురి: కలకత్తాలో డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనకు నిరసనగా ధర్మపురిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన జరిపి, శ్రద్ధాంజలి ఘటించారు. లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, డాక్టర్ రామకృష్ణ, భీమనాతి అశోక్, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవీందర్, శ్రీనివాస్, రాజలింగం పాల్గొన్నారు.

కొడిమ్యాల : కోలకత్తాలోని ఆర్‌జీ కేఏఆర్‌మెడికల్ కాలేజీ మెడికల్ విద్యార్థినిపై జరిగిన దుశ్చర్యను నిరసిస్తూ శనివారం రాత్రి మండల కేంద్రంలోని అంగడి బజారులో గ్రామస్తులు కొవ్వొత్తుల నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు, గ్రామీణ వైద్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట గ్రామంలోని యువకులు ర్యాలీ చేపట్టినంతరం మృతి చెందిన వైద్య విద్యార్థి ఆత్మ శాంతి జరగాలని నివాళులర్పించారు. యువజన సంఘాలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది


మెట్‌పల్లి ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న ఐఎమ్ఏ నాయకులు


ధర్మపురిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

సంక్షిప్త సమాచారం..

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను శనివారం రాయికల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడకుంట్ల నరేష్, చౌడారపు లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడసబ్‌స్టేషన్, పొరండ్ల సబ్‌స్టేషన్ లలో మైంటనెన్స్ మరమ్మత్తులు ఉన్నందున ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లెడ, తక్కళ్లపల్లి, సంఘంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్, అనంతారం, గుట్రాజ్‌పల్లి, పొరండ్ల, కన్నాపూర్, బాలపల్లి, హన్మాజీపేట, కండ్లపల్లి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఇ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మెట్‌పల్లి రూరల్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు, చంద్రికల పెళ్లి రోజు వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి శంఖుని కుంట నిండి మత్తడి దూకటంతో కోనాపూర్ వాగు పార టంతో రాకపోకలు స్తంబించాయి. దంచి కొట్టిన వాన శీర్షికన శనివా రం ఆంధ్రజ్యోతి మినీలో వార్త ప్రచురితం కాగా మండల అధికారులు కొడిమ్యాల తహసీల్దారు టి. రాజమణి, ఎంపీడీవో స్వరూప, గ్రామ కార్యదర్శి మహేష్ స్పందించి కల్వర్టును పరిశీ లించారు. వాగు నుండి ఇసుకను జేసీబీ సహాయంతో పోయించారు.

జగిత్యాలరూరల్: కోరుట్ల ఎస్సైగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కిరణ్‌కుమార్ స్థానంలో కోరుట్ల ఎస్సైగా జగిత్యాల డీఎస్బీలో పనిచేస్తున్న శ్రీకాంత్‌ను బదిలీ చేశారు.

●జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్ ప్రాంగణంలో అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాను రిమోట్ సహాయంతో గాలిలో తిప్పుతున్న ఇద్దరు వ్యక్తులపై జగిత్యాల టౌన్ ఎస్సై తిరుపతి శనివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానవవాళికి హానికల్గించే విధంగా ప్రవరిస్తున్న వ్యక్తులను గుర్తించివారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

●వయోవృద్ధులైన కన్నతల్లితండ్రులను విస్మరిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ అన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలైన కేసులను శనివారం ఆర్డీఓకార్యాలయంలో విచారణ జరిపారు. ఈకార్యక్రమంలో కార్యాలయ ఏవో తపజుల్‌హుస్సేన్, సీనియర్‌సిటిజెన్స్ జిల్లాకమిటీ అధ్యక్షుడు హరిఅశోక్ కుమార్, కమిటీ ప్రతినిధులు ప్రకాశ్‌రావు, విశ్వనాథం, సీనియర్ సహాయకులు పద్మజ, ఎస్‌ఆర్‌వో కొండయ్య పాల్గొన్నారు.

●జగిత్యాల నియోజకవర్గానికి చెందిన నలుగురు లబ్దిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.50 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే క్వార్టర్‌లో డాక్టర్ సంజయ్‌కుమార్ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు.

మెట్‌పల్లి, (ఇబ్రహీంపట్నం): రుణమాఫీ ప్రతి రైతుకు అందేలా అధికారులు చొరవ చూపాలని కోరుతూ శనివారం మాజీ సింగిల్ విండో చైర్మన్ అల్లూరి రఘుపతిరెడ్డి ఆర్డీఓ కార్యలయంలో అధికారి డీఏఓ వసంతకు వినతి పత్రం అందజేశారు. సాంకేతిక సమస్యలను, ఇతర సమస్యలను గుర్తించి సరిచేసి రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

కోరుట్ల రూరల్ : గ్రామాలలో ఇంటి పన్ను వసూలు గ్రామ స్థాయి సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీవో కృపాకర్ అన్నారు. శనివారం మండలంలోని జోగినిపల్లి గ్రామంను సందర్శించి పారిశుద్య పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ అంజయ్యలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన కండ్లి పోచయ్య సైకిల్‌పై వెళ్తుండగా శుక్రవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన గుండ సచిన్ తన ద్విచక్ర వాహనంతో అతి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో పోచయ్యకు తీవ్ర గాయాలు కాగా జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని మనవడు కండ్లి దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 17: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో సందడిగా మారింది. శనివారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● ప్రముఖుల పూజలు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ, మంచిర్యాల జిల్లా జడ్జి శ్రీనివాసులు, కలెక్టర్ సత్యప్రసాద్ కుటుంబసభ్యులు శనవారం ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య ఇతర అధికారులు శాలువలతో సత్కరించారు.

నరసింహుడి సన్నిధిలో..

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి ముత్యాల రాజు దంపతులు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు వేర్వేరుగా శనివారం ఉదయం సందర్శించారు. ఆల యానికి విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు వారిని ఘనంగా ఆశీర్వదిం చారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి వేర్వేరుగా స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి ఘనంగా సత్కరించారు.

'రుణమాఫీపై రైతులను మోసం చేసిన కాంగ్రెస్'

కథలాపూర్, ఆగస్టు 17: రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 46 లక్షల మంది రైతులు రు. 31 వేల కోట్ల రుణాలు తీసుకుంటే కేవలం 20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీకి రు. 36 వేల కోట్లు కేటాయిస్తే కాంగ్రెస్ సర్కారు రు. 2 లక్షల రుణమాఫీకి రు. 22 వేల కోట్లు కేటాయించిందని రైతులు గమనించాలని కోరారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు వర్ధినేని నాగేశ్వర్‌రావు, గుండారపు సౌజన్యగంగాధర్, కల్లెడ శంకర్, మాజీ ఎంపీపీ లింబాద్రి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సోమ దేవేంధర్‌రెడ్డి ఉన్నారు.

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తాం'

జగిత్యాలరూరల్, ఆగస్టు 17: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇప్పించే బాధ్యత తామే తీసుకుంటామని ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట 15 రోజులుగా చేస్తున్న జ ర్నలిస్టుల నిరసన దీక్షకు ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజ య్‌కుమార్ హాజరై నిమ్మరసం తాగించి దీక్షను విరమింపజేశారు.

విద్యార్థులను పండుగ రోజు ఇళ్లకు పంపించాలి

మెట్‌పల్లి, ఆగస్టు 17(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల (బాలుర) విద్యార్థులను రాఖీ పండుగకు ఇంటికి పంపించాలని పాఠశాల ఎదుట జాతీయ రహదారిపై విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి నిరసన తెలిపారు. తల్లిదండ్రుల నిరసనతో కాసేపు జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపో యాయి. పోలీస్‌లు అక్కడకు చేరుకొని శాంతింపజేశారు.

చెర్లపెల్లి గ్రామస్థుల నిరసన

బీర్‌పూర్,ఆగస్టు 17:తమ గ్రామానికి రోడ్డు వేయించాలని శనివారం గ్రామానికి చెందిన యువకులు బురద రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో వేల్పుల రాజేష్, పోతుకంటి శ్యామ్ సుంధర్, అజిత్, వినోద్, సాగర్, సాయి, గణేష్, సురేష్, ప్రేమ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇబ్బందులు'

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 17 : ఎన్నికల సమయంలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తమని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసకారితనంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ములు రాజుపాల్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోని ప్రచారంలోని ప్రతి మీటింగ్‌ల్లో డిసెంబరు 9న ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, నేటికి సగం మందికి మంజూరు కాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి, బీజేవైఎం మండలా ధ్యక్షుడు పీసు రాజేంద ర్‌రెడ్డి, శ్రీధర్, మహేష్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్

రాయికల్, ఆగస్టు 17: రాయికల్ మండల ప్రత్యేకాధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డిని నియమించగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్‌కు ఎంపీడీవో చిరంజీవి పూల మొక్కను అందజేసి స్వాగతం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఉన్నారు.

అర్హులకు రుణమాఫీ ఎందుకు కాలేదు..

వేంపేటలోని కెనరా బ్యాంకు ఎదుట నిరసన


వేంపేటలోని కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 17 : రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ అర్హులైన రైతులకు ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పాలని ఆయా ప్రాంతాల రైతులు శనివారం బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామంలోని కెనరా బ్యాంకు ఎదుట రహదారిపై బైఠాయించి రైతులు ఆందోళన చేశారు. అర్హులైన రైతులందరికీ రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న ప్రకటించిన విషయం తెలిసిందే. రైతు రుణమాఫీ పథకం కింద పలువురికి 16న నిధులు జమైనట్లు కొందరి ఫోన్‌లకు సందేశాలు వస్తున్నాయి. కానీ మూడు విడతల్లో తమకు రుణమాఫీ కాలేదని మండలంలోని వేంపేట, చింతలపేట, మల్లాపూర్ మండలానికి చెందిన ధర్మారం, సాతారం, చిట్టాపూర్‌తో పలు గ్రామాలకు చెందిన వారు నిరసన వ్యక్తం చేశారు. మొదటి విడత నుంచి ఇప్పటి వరకు అర్హులైన రైతులకు ఒక్క రుపాయి కూడా మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంకుల టెక్నికల్ సమస్యలతో కాలేదని త్వరలోనే పరిష్కరిస్తామని బ్యాంకు మేనేజర్ తెలిపినా అక్కడి నుంచి రైతులు కదలలేదు. రుణమాఫీ చేయాలంటూ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేయగా న్యాయం జరిగే వరకు వెళ్లేది లేదని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి షాహిద్‌అలీ సంఘటన స్థలానికి చేరుకొనగా ఆయనకు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. బ్యాంకు మేనేజర్‌తో పాటు ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడగా కోర్ బ్యాంక్ సొల్యూషన్ సిస్టం(సీబీఎస్‌సీ) వల్ల రాష్ట్రంలోని కెనరా, ఇండియన్, ఇండియన్ ఒవర్స్ బ్యాంకులలో సమస్య ఏర్పడిందని, దీంతో పలువురు రైతులుకు రుణమాఫీ కాలేదని, దీనిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కెనరా బ్యాంకు సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రైతులు కోరారు. త్వరలోనే సమస్యను పరిష్కరింప జేయించి అర్హులైన వారికి వర్తింప చేయిస్తామని ఏవో తెలపడంతో శాంతించారు.

పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

మల్లాపూర్ : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు ఏలేటి రాజారెడ్డి అను రైతు రెండు లక్షల రుణమాఫీ నగదు ఖాతాలో జమ కాకపోవడంతో పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశాడు. సీఎం రేవంత్‌రెడ్డి మూడు దపాలుగా రుణమాఫీ చేయగా తన ఖాతలో ఒక్క రుపాయి కూడా జమ కాలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు లక్షలకు ఎక్కువ ఉన్న వారికి రుణమాఫీ కాలేదని జిల్లా వ్యవసాయాధికారి వాణి తెలిపారు. ఎవరు కూడా ఆధైర్య పడొద్దని అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని హామీ ఇవ్వడంతో రైతు శాంతించారు.


పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతన్న రైతు

ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

రాయికల్, ఆగస్టు 17: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయికల్ పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రగతి ఉన్నత పాఠశాల, విశ్వశాంతి పాఠశాలతో పాటు మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాల, భూపతిపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

●మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో హిందూ ధర్మ జాగరణ సమ రక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులతో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

మల్యాల: మండలంలో ఏబీవీపీ నాయకుడు బొడిగే సురేష్ ఆధ్వర్యంలో నూకపల్లి మోడల్ స్కూల్, రామన్న పేట జడ్పీహెచ్ఎస్, సరస్వతీ స్కూల్‌లో రక్షాబంధన్ నిర్వహించి విద్యార్థులకు రాఖీలు కట్టారు.

కోరుట్ల : కోరుట్ల పట్టణ పర్యటనలో ఉన్న కలెక్టర్ సత్యప్రసాద్‌కు సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు రక్షన్ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలను తెలిపారు. అక్కడే ఉన్న ఆర్డీవో ఆనంద్ కుమార్, తహసీల్దార్ కిషన్, ఆసుపత్రి వైద్యులు రెవెన్యూ అధికారులకు రక్షన్ కట్టి సంబరాలు జరిపారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు రక్షాబందన్ వేడుకలను నిర్వహించారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో రక్ష బందన్ వేడుకలను నిర్వహించారు.

కొడిమ్యాల : మండలంలోని రామకిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ముందస్తు రక్షా బందన్ వేడుకలను నిర్వహించారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రాఖీలు కట్టి స్వీ ట్లు తినిపించుకున్నారు.

మల్లాపూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ముందస్తు రాఖీ వేడుకలను విద్యార్థులు జరుపుకున్నారు.

జగిత్యాలరూరల్ : మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలతో పాటుగా అంతర్గాం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ముందస్తు రక్షబంధన్ వేడుకలు నిర్వహించారు. క్రిష్ణానగర్‌లోని ఆల్ఫోర్స్ ఈ టెక్నోహైస్కూల్, మానస, జ్యోతి, సూర్య హై స్కూల్‌లో ఘనంగా ముందస్తు రక్షబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు.


కోరుట్లలో కలెక్టర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు


మల్యాలలో రక్షాబంధన్ వేడుకల్లో విద్యార్థులు


రాయికల్ మండలం భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో


జగిత్యాల ఆల్ఫోర్స్ పాఠశాలలో


జగ్గసాగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో